2023 నూతన సంవత్సర శుభాకాంక్షలు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జఫర్‌గఢ్: వెగంగా వెళ్తున్న బైక్ ఒక్క సారిగా అదుపు తప్పిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు యువకులు గాయపడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై మాధవ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. తిడుగు గ్రామానికి చెందిన గంగాదరి రమేష్(19), తాటికాయల అభిలాష్(17), తాటికాయల అచ్యుత్(17) పని నిమిత్తం ఉదయం ఇంటి నుంచి పల్సర్ బైక్‌పై మండల కేంద్రానికి బయలుదేరారు. బైక్ వెగంగా నడపడంతో సాగరం క్రాస్‌రోడ్డు వద్ద అదుపుతప్పి ముగ్గురు రోడ్డుపై పడిపోయారు. స్థానికులు గమనించి వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన రమేష్, అచ్యుత్‌లను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా.. రమేష్ మార్గమధ్యలో మృతి చెందాడు. చికిత్స పొందుతున్న మిగతా ఇద్దరిలో అచ్యుత్ పరిస్థితి విషమంగానే ఉన్నట్లు ఎస్సై తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో జీపీ వాటర్‌మెన్..

కొడకండ్ల: కొడకండ్ల జీపీ వాటర్‌మెన్‌గా పనిచేస్తున్న సున్నపు శ్రీనివాస్(46) శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానిక ఎస్సారెస్పీ కెనాల్‌కు సమీపాన ఉన్న భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న శ్రీనివాస్.. మోటర్ కాలిపోవడంతో మరమ్మతు చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అతడి కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రమేష్ తెలిపారు. సర్పంచ్ మధుసూదన్, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, మార్కెట్ డైరెక్టర్ కుందూరు అమరేందర్‌రెడ్డి తదితరులు మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చారు.

ట్రాక్టర్ బోల్తాపడి..

పాలకుర్తి టౌన్ : దర్దేపల్లికి చెందిన గనపురం యాకయ్య(26) ట్రాక్టర్ బోల్తాపడి మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న యాకయ్య శనివారం ఇటుక బట్టీల వద్ద మట్టిని ట్రాక్టర్‌తో తొక్కుతుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడటంతో మృతి చెందాడు. యాకయ్యకు భార్య, తల్లి ఉన్నారు. ఈ విషయమై ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కొరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు.

బైక్‌ల దొంగ అరెస్ట్

స్టేషన్‌ఘన్‌పూర్: బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్న హైదరాబాద్ శంషాబాద్ రాజేంద్రనగర్‌లోని ఆదర్శనగర్‌కు చెందిన బోయినవాడ రాజును స్థానిక పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ రఘుచందర్, సీఐ రాఘవేందర్ వివరించారు. బోయినవాడ రాజు, అతడి స్నేహితులు శాఖ వంశీ, ఎండీ.ఇలియాస్ కలిసి హైదరాబా ద్ రాజేంద్రనగర్ పరిధిలో బైక్‌లు, సెల్‌ఫోన్లు అపహరించేవారని పేర్కొన్నారు. స్టేషన్ ఘన్‌పూర్, చిల్పూరు, కాజీపేట పరిధిలో మూడు బైక్‌లు దొంగిలించిన వారు.. స్థానిక రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా రాజు చిక్కాడని చెప్పారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు రూ.2.25లక్షల విలువైన మూడు బైక్‌లను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు పంపామని, మిగతా ఇద్దరు పరారీలో ఉన్నట్లు వివరించారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్

పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఎక్కడ లేని నిబంధనలతో నిరుద్యోగులకు అన్యాయం చేసిందని నిరసిస్తూ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇచ్చిన ప్రగతి భవన్ ముట్టడి భగ్నంలో భాగంగా శనివారం జిల్లాలోని పలు మండలాల్లో యూత్ కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని అన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో నియోజకవర్గ, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు తదితరులు ఉన్నారు. కాగా, రఘునాథపల్లి మండలంలోని కుసుంబాయితండా శివారు జాల్‌తండాకు చెందిన అధికార పార్టీ నేత మూడ్ ధర్మ కంచనపల్లి పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్నాడు. ప్రగతి భవన్ ముట్టడి నేపథ్యంలో మండలంలోని కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆయననూ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నేను రెండేళ్ల క్రితమే కాంగ్రెస్ పార్టీని వీడాను, బీఆర్‌ఎస్‌లో ఉన్నానని ఎంత చెప్పినా వారు వినిపించుకోలేదు. చివరకు ధర్మ అధికార పార్టీ బీఆర్‌ఎస్‌లో ఉన్నాడని తెలిసి వదిలేశారు.

– సాక్షి నెట్‌వర్క్



జనగామ రూరల్: పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు



బచ్చన్నపేటలో..



తరిగొప్పులలో..

మహిళలపై దాడులను అరికట్టాలి

జనగామ రూరల్: బీజేపీ ప్రభుత్వ హయాంలో మహిళలపై హింసలు, దాడులు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టడంలో పూర్తిగా విఫలమైందని ఐద్వా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చీర రజిత అన్నారు. శుక్రవారం ఐద్వా జాతీయ మాహాసభలను పురస్కరించుకొని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని నెహ్రూ పార్క్ నుంచి రైల్వేస్టేషన్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పందిళ్ల కళ్యాణి, భవాని, అంజమ్మ, కొండ వరలక్ష్మి, విజమ్, మానస తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

యంత్రాలతో వ్యవసాయం లాభదాయకం

పాలకుర్తి: యంత్రాల ద్వారా వరి నాటు వేస్తే రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయ శాఖ ఏడీఏ పరుశురాం నాయక్ అన్నారు. శనివారం మండలంలోని ముత్తారంలో రైతు పాడిశెట్టి స్వామి యంత్రంతో వరినాటు వేసే పద్ధతిని ఏడీఏ పరిశీలించి మాట్లాడారు. వ్యవసాయ అధికారులు చింతం సరిత కుమారి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పాలిట సంజీవని సీఎంఆర్‌ఎఫ్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

స్టేషన్‌ఘన్‌పూర్: సీఎం సహాయనిధి నిరుపేదల పాలిట అపర సంజీవనిలా పనిచేస్తుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 23 మంది లబ్ధిదారులకు రూ.4.40 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను రాజయ్య పంపిణీ చేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

స్టేషన్‌ఘన్‌పూర్: కడియం ఫౌండేషన్ సహకారంతో తెలంగాణ రాష్ట్ర, జనగామ జిల్లా కబడ్డీ అసోసియేషన్ల అనుమతితో స్వాగత్ యూత్ ఆధ్వర్యంలో ఈనెల 12,13,14వ తేదీల్లో మండలంలోని ఛాగల్లు గ్రామంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను మండలంలోని నమిలిగొండలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జనగామ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, ఛాగల్లు సర్పంచ్ పోగుల సారంగపాణి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ తోటకూరి వెంకటేశ్వర్లు, నమిలిగొండ ఎంపీటీసీ పురమాని రజాక్‌యాదవ్, ఉపసర్పంచ్ రాంచంద్రు, స్వాగత్‌యూత్ అధ్యక్షుడు కూన రాజు, రాజేష్, కడియం యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నాగరాజు, అశోక్, రవి పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సారంగపాణి తదితరులు

నూతన సంవత్సర వేడుకలకు ముస్తాబు





విద్యుత్ దీపాల వెలుగుల్లో బాలయేసు హైస్కూల్, ముగ్గు వేస్తున్న విద్యార్థినులు

దేవరుప్పుల: నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ఆయా విద్యా సంస్థలు, క్రైస్తవ మందిరాలతోపాటు ఇంటి ముంగిటా ముగ్గులు వేసేందుకు ముస్తాబు చేశారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు ఆధ్వర్యంలో ముగింపు, స్వాగత వేడుకలు నిర్వహించేందుకు పాఠశాలను విద్యుత్ లైట్ల అలంకరణ చేశారు.

‘స్టేషన్’లో ఆలయ వాతావరణం కనిపించాలి



హెడ్ కానిస్టేబుల్‌కు నగదు బహుమతి అందజేస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

బచ్చన్నపేట: పోలీస్‌స్టేషన్‌కు సమస్యలతో వచ్చే వారికి దేవాలయ వాతావరణం కనిపించాలని, అందుకు అన్ని వసతులు సమకూర్చాలని జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ముందుగా కానిస్టేబుళ్ల చేత పరేడ్ నిర్వహించారు. అలాగే వారి సర్వీసు బుక్స్, పోలీస్‌స్టేషన్ ఆవరణలోని మొక్కలను పరిశీలించారు. పరేడ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన హెడ్ కానిస్టేబుల్ బధే రాజు, కానిస్టేబుల్ జలాలుద్దీన్, భానుచందర్, విద్యాలక్ష్మిలకు నగదు బహుమతి అందించి మాట్లాడారు. నర్మెట సీఐ నాగబాబు, ఎస్సైలు నవీన్‌కుమార్, సృజన్‌కుమార్, కానిస్టేబుళ్లు పలువురు పాల్గొన్నారు.

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోండి

తరిగొప్పుల: మండల ప్రజలు ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్, ఖమ్మం ట్రాఫిక్ లాజిస్టిక్ అసిస్టెంట్ మేనేజర్ వేణుగోపాల్ అన్నారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ కార్గో సేవలను సర్పంచ్ దామెర ప్రభుదాస్‌తో కలసి ఆయన శనివారం ప్రారంభించారు. ఉపసర్పంచ్ వెంకటేష్, రీజియన్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ శ్రీధర్, మార్కెటింగ్ ఎక్జిక్యూటీవ్స్ అరవింద్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్గో సేవలను ప్రారంభిస్తున్న వేణుగోపాల్

సంక్షిప్త సమాచారం

క్యాలెండర్ ఆవిష్కరణ

కొడకండ్ల: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం టీఎస్ యూటీఎఫ్ నూతన సంవత్సర-2023 క్యాలెండర్‌ను డీఈఓ కె.రాము ఆవిష్కరించారు. మండల నోడల్ ఆఫీసర్ గ్రేస్‌కేజీయారాణి, రామరాజు, సంఘ జిల్లా కార్యదర్శి ముషీర్‌ఖాన్ నాయకులు వెంకటాద్రి పాల్గొన్నారు.

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో శనివారం టీఎస్‌యుటీఎఫ్-2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

చేనేతల..

బచ్చన్నపేట: మండల కేంద్రంలో శివభక్త మార్కండేయ స్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేనేతల-2023 నూతన క్యాలెండర్లను ఆవిష్కరించారు. నరేందర్, బాల్‌రాజు, కృష్ణమూర్తి, నాగేష్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

బచ్చన్నపేట: డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని తహసీల్దార్ వినయలత అన్నారు. శనివారం మండలంలోని ఇటుకాలపల్లిలో పర్యటించి డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు. త్వరలో అర్హుల జాబితాను తయారు చేస్తామన్నారు. కాగా, మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో టీఎస్ యూటీఎఫ్-2023 నూతన క్యాలెండర్‌ను తహసీల్దార్ వినయలత ఆవిష్కరించి మాట్లాడారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం

జఫర్‌గఢ్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పూర్తిగా గాలికివదిలేశాయని ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు యాకన్ననాయక్, సిరికొండ అర్జున్ పేర్కొన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ అవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో నాయకులు, విద్యార్థులు కలిసి అవిర్భావ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాకన్ననాయక్ జెండా అవిష్కరణ చేశారు.

అర్హులకు ‘డబుల్’ఇళ్లు అందకపోతే రాజీనామాకు సిద్ధం

జనగామ రూరల్: ఎల్లంలలోని అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు అందించాలని లేని పక్షంలో తన పదవికి రాజీనామాకు సిద్ధమని సర్పంచ్ ఎర్ర సుజాత అన్నారు. శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సర్పంచ్ మాట్లాడారు. ఉపసర్పంచ్ అంజయ్య, వార్డు సభ్యులు ఉన్నారు.

ఉద్యోగులకు విరమణ తప్పదు

స్టేషన్‌ఘన్‌పూర్: ఉద్యోగులకు ఎప్పటికైనా ఉద్యోగ విరమణ తప్పదని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసేవారికి సమాజంలో ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని విద్యాజ్యోతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ థామస్‌కిరణ్, కేయూ డిప్యూటీ రిజిస్ట్రార్ నేతాజీ అన్నారు. స్థానిక విద్యాజ్యోతి డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు పేర్వారం రవీందర్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌ను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు పుష్పగుచ్ఛాలు, శాలువాతో సన్మానించారు.

అయ్యప్పస్వాముల ఆందోళన



జనగామ: రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న స్వాములు, హిందువులు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

జనగామ/స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్/కొడకండ్ల/పాలకుర్తిటౌన్: మహబూబ్‌నగర్ జిల్లా కొడంగల్ సమావేశంలో అయ్యప్ప స్వామిపై, దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై పీడీ యాక్టు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ అయ్యప్పస్వాములతో పాటు వీహెచ్‌పీ బాధ్యులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు జిల్లాలోని పలు మండల కేంద్రాల్లో శనివారం ఆందోళనకు దిగారు. జనగామ బాణాపురం అయ్యప్పస్వామి ఆలయ సంఘం, హిందూ సంఘాలు, విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. భారీ ర్యాలీగా జనగామ పట్టణంలోని ఆర్టీసీ చౌరస్తాకు చేరుకొని జాతీయ రహదారిపై మానవహారం, రాస్తారోకో నిర్వహించడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో నరేష్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఐ ఎలబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్సైలు శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది బందోబస్తు చేపట్టారు. అలాగే పలు పోలీస్‌స్టేషన్లలో అయ్యప్పస్వామిని కించపరిచే విధంగా మాట్లాడిన నరేష్‌పై పీడీ యాక్టు నమోదు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, ఎస్ఎస్ఆర్‌పీఎస్, అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఆయా కార్యక్రమంలో బిజ్జాల నవీన్, రాజేశ్వరాచార్యులు, మామిడాల రాజు, తడకమల్ల నర్సింహారావు, మహంకాళి హరిశ్చంద్రగుప్త, మంచాల రవీందర్, విద్యార్థి జేఏసీ సంఘం ప్రతినిధులు పిట్టల సురేష్, మంగళంపల్లి రాజు, గన్ను కార్తీక్, తుంగ కౌశిక్, సుభాష్, అజయ్, అనిల్ చౌహన్, దినేష్, ఎస్‌సీఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ముక్క స్వామి, గండి నాగరాజు, బీరయ్య, రంగనర్సింగారావు, సారయ్య, వేణుగౌడ్, బ్రహ్మం, కుమార్ ఉన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై చర్య తీసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్: తనపై అకారణంగా భౌతికదాడి చేసి గాయపర్చిన వ్యక్తిపై చట్టపరంగా తగిన చర్య తీసుకోవాలని కోరుతూ డివిజన్ కేంద్రానికి చెందిన వాంకుడోత్ పద్మ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ తాను ఘన్‌పూర్‌లో పాత సినిమా థియేటర్ కాలనీలో 20 ఏళ్లుగా అద్దెకు ఉంటున్నానని తెలిపింది. అయితే ఘన్‌పూర్‌కు చెందిన రేండ్ల యాదగిరి అనే వ్యక్తి అకారణంగా తనతో గొడవ పెట్టుకుని దాడి చేశాడని, ఈ దాడిలో తన చేయికి తీవ్ర గాయమైందని వాపోయింది. ఈ విషయమై స్థానిక పోలీసులు తక్షణమే స్పందించి అతడిపై చట్టపరంగా చర్య తీసుకోవాలని ఆమె కోరింది.